క్లుప్తంగా

లయన్స్‌క్లబ్ గోల్డ్ సేవలు అభినందనీయం



వాటర్ ప్లాంట్ ప్రారంభించి నీరు తాగుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు రూరల్: లయన్స్‌క్లబ్ ఆఫ్ చిత్తూరు గోల్డ్ సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. చిత్తూరు నగరం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలో శుక్రవారం లయన్స్‌క్లబ్ గోల్డ్ ఆఫ్ అధ్యక్షుడు ఎంపీ శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్లాంట్‌ను ప్రారంభోత్సవం చేశారు. కార్యక్రమంలో సభ్యులు నరేష్ రెడ్డి, రెడ్డెప్ప, ప్రభాకర్, జమీర్, మనోహర్, సభ్యులు పాల్గొన్నారు.

క్రైస్తవుల జెండా ఆవిష్కరణ

చిత్తూరు రూరల్: చిత్తూరు నగర, మండల ప్రాంతాల్లో శుక్రవారం క్రైస్తవులు జెండా ఆవిష్కరణ మహోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. చర్చిల్లో ప్రత్యేక ఆరాధన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనలతో శిలువ కొండల్లో, ఆలయ ఆవరణాల్లో జెండాను ఎగురవేశారు. అనంతరం అన్నదానం చేశారు. ప్రత్యేక గీతాలాపానలు, భజనలతో భారీగా ఊరేగించారు.

6న హుండీ కానుకల లెక్కింపు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి హుండీ కానుకల లెక్కింపు ఈ నెల 6న బుధవారం లెక్కించనున్నట్లు ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి స్వామివారి ఆస్థాన మండపంలో ఈ లెక్కింపునకు ఆలయ అధికారులు, సిబ్బంది హాజరు కావాలని కోరారు.

నేడు మండల సమావేశం

ఐరాల: స్థానిక ఎంపీడీఓ సమావేశ భవనంలో ఎంపీపీ మోహన్ అధ్యక్షతన శనివారం ఉదయం 10.30 గంటలకు సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నాగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో గ్రామాల అభివృద్ధిలో తీసుకోవాల్సిన అంశాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలతో సమావేశానికి హాజరు కావాలని సూచించారు. సర్పంచులు, జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీలు, కో–ఆప్షన్ మెంబర్, ఎంపీటీసీ సభ్యులు హాజరుకావాలన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



రికార్డును పరిశీలిస్తున్న ఎంపీడీఓ గౌరి

పూతలపట్టు: మండలంలోని పాటూరు అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం ఎంపీడీఓ గౌరి తనిఖీ చేశారు. పిల్లలతో ముచ్చటించారు. మధ్యాహ్న భోజనం బాగుంటుందా? అని పిల్లలతో అడిగి ఆరా తీశారు. వంటగదిని పరిశీలించారు. ఒక్కో పిల్లవాడికి ఎంత మోతాదులో ఆహారపు దినుసులు అందిస్తున్నారని అడిగి పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోనే వంటలన్నీ వండాలని నిర్వాహకులకు సూచించారు. ప్రభుత్వం నుంచి అందుతున్న ప్రతీ వస్తువు పిల్లలకు అందాలని అంగన్‌వాడీ కార్యకర్తకు ఆదేశించారు.

ఉత్తమ కౌన్సిలర్‌గా బాబు

బంగారుపాళెం: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ఐసీటీసీ కౌన్సిలర్‌గా విధులు నిర్వహిస్తున్న బాబు జిల్లా ఉత్తమ కౌన్సిలర్‌గా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. చిత్తూరు జెడ్పీ సమావేశ భవనంలో శుక్రవారం జాతీయ ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవలు అందించిన వారికి ప్రశంసా పత్రాలను అందజేశారు.

చైతన్యంతోనే ఎయిడ్స్ నిర్మూలన

బంగారుపాళెం: ప్రజా చైతన్యంతోనే ఎయిడ్స్ వ్యాధి నిర్మూలన సాధ్యమని మండల వైద్యాధికారి డాక్టర్ లోహిత్‌వెంగల్‌రాయన్ బంగారుపాళెం సిహెచ్‌సీ డాక్టర్ శిరీష అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ నిర్మూలన దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలో వైద్య, ఆరోగ్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి నుంచి జాతీయ రహదారి మీదుగా నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ చేపట్టారు. వారు మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధిపై అనుమానం ఉంటే, బంగారుపాళెం ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలోని ఐసీటీసీలో ఉచిత సలహాలు, మందులు ఇస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్లు రమేష్, లోకేష్, సీహెచ్‌సీ వైద్యులు అఖిల్, శాలిని, జ్యోతి, స్వరూప్‌నాయక్, విజయకుమారి, కావ్య, భరత్ సూపర్‌వైజర్లు, ఆరోగ్య సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పీలు, సచివాలయ ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో...

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులు, అధ్యాపకులు హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపల్ ఎస్‌కే మురళి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి మురళి అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంటించుకునే వ్యాధి

తవణంపల్లె: ఎయిడ్స్ వ్యాధి అంటువ్యాధి కాదని, అంటించుకొనే వ్యాధి అని మండల వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక తెలిపారు. మండల కేంద్రంలో వైద్యాధికారులు, సిబ్బంది ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు డాక్టర్ ప్రియాంక, డాక్టర్ మోహన్‌వేలు, పీహెచ్‌ఎన్ భారతి, హెల్త్ సూపర్‌వైజర్లు రాజశేఖర్, రెడ్డెమ్మ, హరి, హెల్త్ అసిస్టెంట్లు శ్రీనివాసులు, సుబ్రమణ్యం రెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై ర్యాలీ

యాదమరి: మండల కేంద్రంలో ప్రభుత్వాసుపత్రి వైద్యులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సిబ్బందికి ఆస్పత్రి ఆవరణలో వైద్యాధికారి అనిల్‌కుమార్ నాయక్ సమావేశం ఏర్పాటు చేశారు. సీహెచ్‌ఓ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

విస్తృత స్థాయిలో అవగాహన

ఐరాల: ఎయిడ్స్ వ్యాధిపై ప్రజల్లో ప్రభుత్వం విస్తృత స్థాయిలో అవగాహన కల్పిస్తోందని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత తెలిపారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఎయిడ్స్ వ్యాధి నివారణపై ర్యాలీ నిర్వహించారు. వారపు సంత వద్ద మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ సుగుణ, పీహెచ్‌ఎన్ జీవకళ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ రహిత సమాజాన్ని నిర్మించాలి

గుడిపాల: హెచ్‌ఐవీ రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని గుడిపాల, బొమ్మసముద్రం ప్రాథమిక వైద్యాధికారులు సంధ్య, రష్మిత అన్నారు. ప్రపంచ హెచ్‌ఐవీ, ఎయిడ్స్ నివారణపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం గుడిపాల, బొమ్మసముద్రం కళాశాల విద్యార్థులు ఎయిడ్స్‌పై ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది నరసింహమూర్తి, భానుప్రకాష్, చంద్రశేఖర్, జబసెల్వి, శాంతకుమారి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ముందు జాగ్రత్తే అసలైన మందు

చిత్తూరు కలెక్టరేట్: హెచ్‌ఐవీ పట్ల ముందు జాగ్రత్తే అసలైన మందు అని సావిత్రమ్మ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మనోహర్ అన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆ కళాశాల వైస్ ప్రిన్సిపల్ నరేంద్రకుమార్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ షమ్స్ అక్తర్, తదితరులు పాల్గొన్నారు.

పీసీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ అబ్దుల్ మజీద్ ఆధ్వర్యంలో శుక్రవారం కొత్త ఓటర్ల నమోదు, ఎయిడ్స్ నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ చిట్టిబాబు, అధ్యాపకులు షాజహాన్, రమేష్‌బాబు పాల్గొన్నారు.





చిత్తూరు: సావిత్రమ్మ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థుల ర్యాలీ, గుడిపాల: ర్యాలీ చేస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది









ఐరాల: ప్రతిజ్ఞ చేయిస్తున్న డాక్టర్ పూర్ణలత, తవణంపల్లె: ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది, యాదమరి: ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, బంగారుపాళెం: ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

గ్రామీణులకు వైద్య సేవలు

గుడిపాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్‌తో గ్రామీణులకు ఇంటివద్దే వైద్యం అందుతోందని బొమ్మసముద్రం పీహెచ్‌సీ వైద్యాధికారి అనూష అన్నారు. నంగమంగళం గ్రామంలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు రక్త పరీక్షలు నిర్వహించారు. బీపీ, చక్కెర వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది యమున, ప్రియాంక, శ్రీలత, వరలక్ష్మి, రూబి పాల్గొన్నారు.

పేదలకు వరం ఫ్యామిలీ డాక్టర్

ఐరాల: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిరుపేదల పాలిట వరమని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని ఐలవారిపల్లెలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో డాక్టర్ 85 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. మంచానికే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం గ్రామంలో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు అరికట్టాలి

గుడిపాల: బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని వెలుగు సీసీ హేమచంద్రారెడ్డి, వసంతాపురం సచివాలయం మహిళా పోలీస్ పావని సూచించారు. వసంతాపురం గ్రామసమాఖ్య సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం జెండర్, మహిళలకు సంబంధించిన విషయాలు, బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన కల్పించి, జెండర్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ మురళీకృష్ణ పాల్గొన్నారు.

నేడు భూ పంపిణీ

బంగారుపాళెం: మండల కేంద్రంలో శనివారం భూ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి తెలిపారు. అరగొండ రోడ్డు పక్కన గల ఎస్‌ఎల్‌వీ కల్యాణ మండపంలో మధ్యాహ్నం కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు. స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్‌బాబు చేతుల మీదుగా పట్టాలు పంపిణీ చేసే ఈ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

రేపు ఉచిత యోగా శిక్షణ తరగతులు

చిత్తూరు కలెక్టరేట్: నగరంలోని క్యాంఫోర్డ్ పాఠశాలలో సిద్ధ సమాధి ఉచితంగా యోగా శిక్షణ అందించనున్నట్లు యోగాచార్యులు నరేంద్రకుమార్ వెల్లడించారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ 14 ఏళ్ల పైబడిన వారికి ఈ నెల 3వ తేదీ నుంచి 16వ తేదీ వరకు శిక్షణాతరగతులు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇతర వివరాలకు 8247609140ను సంప్రదించాలని కోరారు.

పాల వెల్లువతో పాడిరైతులకు ఆర్థిక భరోసా

బంగారుపాళెం: జగనన్న పాలవెల్లువతో మహిళా రైతులకు ఆర్థిక భరోసా కల్పించనున్నట్లు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. మండలంలోని సంక్రాంతిపల్లెలో శుక్రవారం అమూల్ డెయిరీ సహకారంతో బల్క్‌మిల్క్ కలెక్షన్ యూనిట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాడి రైతులకు ఆర్థిక భరోసా కలిగించేలా చర్యలు తీసుకున్నారని తెలిపారు. గ్రామాల్లో మహిళా సంఘాల ద్వారా పాలు సేకరించి అమూల్ సంస్థకు పాలు సరఫరా చేస్తున్నట్లు వివరించారు. ప్రైవేట్ డెయిరీల కంటే లీటరుకు రూ.5 నుంచి 7 ధర అదనంగా ఇస్తున్నట్లు తెలిపారు. ఎన్నికలకు ముందు పాడిరైతులకు ఇచ్చిన హామీలను జగనన్న నెరవేర్చుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ అమరావతి, అమూల్ డెయిరీ ఇన్‌చార్జి నవీన్, ఇన్‌చార్జి ఎంపిడిఓ హరిప్రసాద్‌రెడ్డి, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు కిషోర్‌కుమార్‌రెడ్డి, పార్టీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



సంక్రాంతిపల్లెలో పాలసేకరణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాబు

ఓటర్ల నమోదుకు ప్రత్యేక శిబిరాలు

తవణంపల్లె: కొత్త ఓటర్ల నమోదుకు 2, 3 తేదీల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ గుణశేఖర్ రెడ్డి తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఆదివారం, సోమవారం రెండు రోజులపాటు ఆయా పోలింగ్ కేంద్రాల్లో నూతన ఓటర్ల నమోదు కోసం ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసినట్లు వివరించారు. మండలంలోని 56 పోలింగ్ కేంద్రాల్లో అర్హులైన వారు బీఎల్వోల దగ్గర ఫాం–6 నమోదు చేసి ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. బీఎల్వోల దగ్గర నూతన ఓటర్ల నమోదుకు ఫారం 6, మరణించిన, వివాహం చేసుకొని వెళ్ళిన మహిళల పేర్లు తొలగించుటకు ఫారం 7, తప్పులు సరిదిద్దడానికి ఫారం 8 లో నమోదు చేసి ఇవ్వాలని సూచించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆడుదాం ఆంధ్రపై అవగాహన కల్పించాలి

గుడిపాల: ఆడుదాం ఆంధ్రపై ప్రతి ఒక్కరికీ తెలియజేయాలని ఎంపీడీవో రాజశేఖర్‌రెడ్డి అన్నారు. నరహరిపేట జెడ్పీ హైస్కూల్లో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులు, గ్రామ వలంటీర్లకు ఆడుదాం–ఆంధ్ర క్రీడా కార్యక్రమంపై శిక్షణా కార్యక్రమాన్ని పీడీలు నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ఇందులో 5 క్రీడలు ఉంటాయని వీటిని ఎలా నిర్వహించాలి అన్న వాటిపై వారికి శిక్షణ ఇచ్చారు. 15ఏళ్లకు పైబడిన వారందరూ సచివాలయంలోగానీ ఆన్‌లైన్‌లోగానీ లేక 1902కు కాల్ చేసి రిజిష్టర్ చేసుకోవాలన్నారు. అన్ని క్రీడల్లోనూ మహిళలకూ ప్రవేశం ఉందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 గణపతి పాల్గొన్నారు.

జగనన్నను మళ్లీ గెలిపించుకుందాం

నవరత్నాల రూపకర్త ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ గెలిపించుకోవాలని చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, ఎంఎస్ బాబు పిలుపునిచ్చారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని శుక్రవారం రెండు నియోజకవర్గాల్లోని ఏడు మండలాల్లో నిర్వహించారు. ఎమ్మెల్యేలతో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు పాల్గొని సంక్షేమ పథకాల బోర్డులు, పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే ఎంఎస్ బాబు తలపులపల్లెలో పల్లెనిద్ర చేశారు. –సాక్షి నెట్‌వర్క్



గుడిపాల: సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, పార్టీ శ్రేణులు



తవణంపల్లె: సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



ఐరాల: సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు



యాదమరి: పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి



పూతలపట్టు: పల్లెనిద్రలో భాగంగా స్థానికులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్‌బాబు



బంగారుపాళెం: సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సోమశేఖర్